క్లుప్తంగా

ఎంపీ మాగుంటను కలిసిన ఎమ్మెల్యే కరణం



ఎంపీ మాగుంటతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆయన తనయుడు మాగుంట రాఘవరెడ్డిని శుక్రవారం ఒంగోలులో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్‌లు మర్యాద పూర్వకంగా కలిసి కొద్దిసేపు వారితో మాట్లాడారు.

బయోఫ్లాక్ కల్చర్‌తో బహుళ ప్రయోజనాలు



అవగాహన కల్పిస్తున్న మత్స్యశాఖ సిబ్బంది

చినగంజాం: రొయ్యల సాగుబడిలో బయోఫ్లాక్ కల్చర్‌తో రైతులకు బహుళ ప్రయోజనం చేకూరుతుందని మోటుపల్లి గ్రామ మత్స్య సహాయకురాలు కొమెర ప్రమీల అన్నారు. శుక్రవారం గ్రామంలో పీఎంఎంఎస్‌వై పథకం ద్వారా మంజూరు చేయబడిన పలగాని శివకుమార్ రెడ్డి బయోఫ్లాక్ ప్లాంట్ వద్ద మూడో విడత వైఎస్సార్ మత్స్య సాగుబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మోటుపల్లి గ్రామ రైతులు, మత్స్య సహాయకులు, సాగర్ మిత్రలు పాల్గొన్నారు.

4న శంకవరప్పాడు ఉప సర్పంచ్ ఎన్నిక

అద్దంకి రూరల్: ఉపసర్పంచ్ ఎన్నిక నోటిఫికేషన్‌లో భాగంగా ఈనెల 4వ తేదీ ఉదయం 11 గంటలకు మండలంలోని శంకవరప్పాడు గ్రామ ఉపసర్పంచ్ ఎన్నిక నిర్వహించనున్నట్లు రిటర్నింగ్ అధికారి డీ గంగాధరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన నోటీసులను గ్రామ సర్పంచ్‌తో పాటు 12 మంది వార్డు సభ్యులకు అందజేశామన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

చీరాల టౌన్: చదువే అన్నింటికి మూలం.. అందరూ చక్కగా చదువుకున్ని లక్ష్యాన్ని ఎంచుకుని సాధించేందుకు ప్రణాళికా బద్ధంగా చదువుకోవాలని రోటరీక్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్లు డాక్టర్ ఐ.బాబూరావు, పోలుదాసు రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని బుర్ల వారిపాలెం పంచాయతీలోని సాయికాలనీ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ చదువుతున్న విద్యార్థినులకు చీరాల రోటరీక్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూరావు, మామిడాల సాయిమణిప్రదీప్‌ల ఆర్థిక సాయంతో నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు బి.హేమంత్ కుమార్, వి.మురళీకృష్ణ, సుభాషిణి, పార్వతి, శివాంజనేయ ప్రసాద్ ఉన్నారు.

చురుకుగా ఘాట్ రోడ్డు పనులు



అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి వెళ్లే ఘాట్ రోడ్ పనులు చురుకుగా సాగుతున్నాయి. పాత రహదారి దెబ్బతినడంతో పాటు సరైన వెడల్పు లేకపోవడంతో రూ.30 లక్షలతో కొత్తగా వేసే బీటీ రహదారిని 3.45 మీటర్లు ఉండే విధంగా నిర్మిస్తున్నారు. దీంతో ఇక నుంచి వాహనదారులు ఇబ్బంది లేకుండా కొండ ఎక్కొచ్చని అధికారులు తెలిపారు.

ఉపకారం.. విద్యకు సహకారం

- ప్రతిభా స్కాలర్‌షిప్ పరీక్షలకు దరఖాస్తులు
- సెప్టెంబర్ 15 వరకు గడువు
- ఎనిమిదో తరగతి విద్యార్థులు అర్హులు
- ఏటా రూ. 12 వేల సాయం



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

వేటపాలెం: ప్రతిభ కలిగిన విద్యార్థులకు మరో సువర్ణవకాశం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను చదువుల్లో పోత్సహించేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. మంచి ప్రతిభ కలిగిన విద్యార్థులకు ఆర్థికంగా బాసటగా నిలిచేందుకు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎస్ఎంఎంఎస్) ఉపయోగపడనుంది. 2023–24 విద్యా సంబంధించి ఎస్ఎంఎంఎస్ నోటిఫికేషన్ విడుదల చేసింది.

విద్యార్థులకు ప్రయోజనం ఇలా..

ఎస్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులకు నెలకు రూ.1000 చొప్పున ఏడాదికి రూ. 12 వేలను స్కాలషిప్ రూపంలో ప్రభుత్వం అందిస్తుంది. ఈ మొత్తం నేరుగా విద్యార్థి బ్యాంకు ఖాతాలోకి జమవుతుంది. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ పూర్తిచేసే వరకూ ఈ ఉపకార వేతనం లభిస్తుంది. ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హత పరీక్ష రాయాల్సి ఉంటుంది. జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షకు వేల సంఖ్యలో హాజరవుతుంటారు. పరీక్షలకు హాజరైన వారిలో దాదాపు 50 శాతం మంది అర్హత సాధిస్తుంటారు.

పరీక్షలకు ఈఅర్హతలు తప్పనిసరి..

- ప్రభుత్వం, ఎయిడెడ్ స్థానిక సంస్థల పాఠశాల్లో రెగ్యులర్ విధానంలో చదివే విద్యార్థులు అర్హులు.
- ఏడో తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించి ఉండాలి.
- తుది ఎంపిక సమయం నాటికి 8వ తగతిలో 55 శాతం మార్కులు పొందాలి. కుటుంబ వార్షిక ఆదాయం ఏడాదికి రూ. 3.50 లక్షలకు మించ కూడదు.

పరీక్ష విధానం..

అర్హులైన విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో పరీక్ష నిర్వహిస్తారు. ఆబ్జెక్టివ్ విధానంలో రెండు పేపర్లుగా పరీక్ష ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ టెస్ట్ (మ్యాట్), స్కాలస్టిక్ ఆప్టిట్యూడ్ టెస్ట్, ఇలా రెండు పేపర్లు కలిపి 180 మార్కులు ఉంటాయి. పరీక్ష సమయం మూడు గంటలు, గణితం పేపర్‌లో మూడు విభాగాలు నుంచి 90 ప్రశ్నలు, మెంటల్ ఎబిలిటీ 45, ఇంగ్లిష్ నుంచి 20 ప్రశ్నలు, హిందీ నుంచి 25 చొప్పున ప్రశ్నలు చొప్పున ఇస్తారు. సాట్ పేపర్‌లో కూడా మూడు విభాగాల నుంచి ప్రశ్నలు ఇస్తారు. మొత్తం 90 ప్రశ్నలుంటాయి. ఇందులో సైన్స్– 35, సోషల్ స్టడీస్–35, మేథమెటిక్స్ విభాగం నుంచి 20 చొప్పున ప్రశ్నలు అడుగుతారు.

దరఖాస్తులు ప్రారంభం..

దరఖాస్తుల స్వీకరణ ఆగస్టు 10 నుంచి ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వ సెకండరీ ఎడ్యుకేషన్ బోర్డ్ అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పెట్టుకోవాల్సి ఉంటుంది. ప్రింటవుట్లను, ధ్రువీకరణ పత్రాలను డీఈవోలకు పంపించాలి. సెప్టెంబర్ 15 తుది గడువుగా నిర్ధారించారు. ప్రింటెడ్ పత్రాలను సెప్టెంబరు 19న డీఈవో కార్యాలయంలో సమర్పించాలి. డిసెంబర్‌లో పరీక్షలు ఉంటాయి. ప్రతి విద్యార్థి పరీక్ష ఫీజు కింద రూ. 100 ఎస్‌బీఐ చలానా రూపంలో సంబంధిత ధ్రువపత్రాలతో పాటు జతచేయాలి. ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులు రూ. 50 చెల్లిస్తే సరిపోతుంది. హెచ్‌టీటీపీ: బీఎ స్ఈ.ఏపీ. జీవోవీ. ఇన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

నాలుగేళ్ల పాటు ఆర్థిక చేయూత..



ఎస్ఎంఎంఎస్ ప్రతిభా స్కాలర్ షిప్ పోటీ పరీక్షలు పేద విద్యార్థులు, ప్రతిభావంతులైన విద్యార్థులకు నాలుగేళ్ల పాటు ఆర్థిక చేయూత నిస్తుంది. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదవాలి. గణితం, ఇంగ్లిషులో పట్టు ఉంటే చాలు మంచి ఫలితం సాధించవచ్చు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులు భవిష్యత్‌తో మంచి ఉన్నత ఫలితాలు సాధించుకోవచ్చు. ప్రణాళికా బద్ధంగా నెల రోజుల పాటు చదివితే విజయం తథ్యం.

– ఐ పురుషోత్తం, ఎంఈఓ–2, వేటపాలెం

ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు



లబ్ధిదారులకు బుక్‌లెట్ అందిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆమంచి

- నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి

మార్టూరు: రాష్ట్రాభివృద్ధి, ప్రజల సంక్షేమం సమాంతరంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి చెందినట్లు అని.. రెండింటిని రెండు కళ్లగా భావించి అభివృద్ధి చేయటమే ప్రభుత్వం లక్ష్యం అని పర్చూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం మండలంలోని రాజుపాలెం, డేగరమూడి గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. రాజుపాలెం గ్రామానికి గత నాలుగేళ్లలో అమ్మఒడి పథకం ద్వారా 382 మందికి రూ 2.04 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా 278 మందికి రూ 1. 44 కోట్లు, పెన్షన్ ద్వారా 607 మందికి రూ 6.97 కోట్లు, ఆసరా పథకం ద్వారా 876 మందికి రూ 1.67 కోట్లు, రైతు భరోసా ద్వారా 514 మంది రైతులకు రెండు విడతల్లో రూ 1.24 కోట్లు పంపిణీ చేసినట్లు ఆమంచి తెలిపారు. ప్రజలు గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించి మరోసారి సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, మాజీ ఏఎంసీ చైర్మన్ జాష్టి వెంకట నారాయణబాబు, మండల కన్వీనర్ పఠాన్ కాలేషావలి, గడ్డం మస్తాన్‌వలి, సర్పంచ్ జంపని వీరయ్య, రెండు గ్రామాల సచివాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ పింఛన్లు

- నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



దివ్యాంగ బాలుడికి పింఛన్ మంజూరు పత్రాన్ని అందిస్తున్న వెంకటేష్

వేటపాలెం: అర్హులైన వారందరికీ సామాజిక పింఛన్లు అందిస్తామని చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పేర్కొన్నారు. స్థానిక మండలం పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా మంజూరైన పింఛన్లను శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటేష్ మాట్లాడుతూ వేటపాలెం మండల పరిధి లో కొత్తగా 275 మందికి పెన్షన్‌లు మంజూరైనట్లు తెలిపారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పెన్షన్‌లు వలంటీర్ల ద్వారా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికే వచ్చి అందజేస్తున్నారని తెలిపారు. రాబోవు ఎన్నికల్లో తిరిగి జగన్ మోహన్ రెడ్డిని గెలుపించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కే నేతాజీ, శర్మ, మాజీ సర్పంచ్ లేళ్ల శ్రీధర్, అందెకృష్ణ, జిడుగు మస్తాన్, బొడ్డు సుబ్బారావు, ఖధీర్ పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



పూనూరులో విశేష అలంకరణలో త్రిపురసుందరిదేవి, గాయత్రిదేవి



శింగరకొండలో వ్రత కార్యక్రమంలో మహిళలు



చినగంజాం: రాజ్యలక్ష్మి వ్రతం పూజల్లో పాల్గొన్న మహిళలు



చెరుకూరులో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు

అద్దంకి: శ్రావణ మాసంలో శుక్రవారానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ముత్తైదువులు అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రం శింగరకొండ క్షేత్రాధిపతి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా మహిళలచే సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేయించారు. ఈకార్యక్రమంలో 108 మంది మహిళలు పాల్గొన్నారు. తరువాత భక్తులకు దేవస్థానం తరుపున పూజా సామగ్రిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమాన్ని దేవస్థాన అర్చకుడు ధర్మకర్తల మండలి అధ్యక్షుడు నర్రావుల కొండలు పర్యవేక్షించారు.

అలయాల్లో శ్రావణ శోభ..

యద్దనపూడి: పవిత్ర శ్రావణ మాసం మూడో శుక్రవారం సందర్భంగా మండలంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి విశేష అలంకరణలు, కుంకుమార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పూనూరులోని రామకృష్ణధ్యాన మందిరంలో త్రిపురసుందరిదేవి, గాయత్రిదేవి అమ్మవార్లకు అభిషేకాలు, లలిత సహస్రనామ పారాయణం, కనకధార సోత్రాలను పఠించారు. పోలూరులో చెన్నుమల్లికార్జునస్వామి, గన్నవరం కాశీ విశ్వేశ్వరస్వామి, చింతపల్లిపాడు చెన్నకేశవస్వామి, పూనూరు నిదానంపాటి శ్రీలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు విశేషపూజలు, అర్చనలు నిర్వహించారు.

- పర్చూరు మండలలంలోని చెరుకూరు గ్రామంలో వేంచేసియున్న త్రివిక్రమస్వామి దేవాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఈవో నాగయ్య, దేవస్థాన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.
- చినగంజాంలో భావన్నారాయణ స్వామి ఆలయంలో సామూహిక శ్రావణమాస రాజ్యలక్ష్మి వ్రత పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు అశహరి మోహన లక్ష్మీ నరసింహాచార్యులు పూజా కార్యక్రమాలతో రాజ్యలక్ష్మి సామూహిక వ్రత పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ సేవాదళ సభ్యుడు జీ పిచ్చయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమ్మవారికి విశేష పంచామృత స్నపన తిరుమంజన కార్యక్రమం నిర్వహించారు.

అభివృద్ధి దిశగా కుందేరు..



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కరణం

చీరాల: కుందేరు కాలువను అభివృద్ధి దిశగా చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. కుందేరు అభివృద్ధి పనుల్లో భాగంగా చీరాల పట్టణం, వేటపాలెం మండలంలో ఉన్న కుందేరులో రూ.11 లక్షలతో లాంగ్ స్టిక్ క్రేన్ ద్వారా పూడికలు తీస్తున్నారు. పనులను ఎమ్మెల్యే పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనుకున్న సమయంలో పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రత్యేక కృషి చేస్తున్నామని ఆయన తెలపారు. కుందేరులోని జమ్ము, గుర్రపు డెక్కలు తొలగింపు కార్యక్రమాలను పరిశీలించారు. ఆయన వెంట డాక్టర్ అమృతపాణి, అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, గోలి గంగాధర్, డ్రైనేజి ఈఈ మురళీకృష్ణ, డీఈ దివి సుబ్బారావు, ఏఈఈ వై.కోటేశ్వరరావు, మున్సిపల్ డీఈ ఐసయ్య, ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉద్యోగుల బాధ్యతల స్వీకరణ

కారంచేడు: వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వం ఒక్కో పీహెచ్‌సీలో 14 మంది ఉద్యోగులు వివిధ కేడర్లలో విధులు నిర్వహించేలా జీఓ 143ని విడుదల చేశారు. ఈ జీవో ప్రకారం ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా జోన్‌లు, జిల్లాలకు సిబ్బందిని సర్దుబాటు చేస్తున్నారు. గత నెల 25వ తేదీన గుంటూరు ఆర్డీ కార్యాలయంలో వైద్యశాఖలోని వివిధ కేడర్ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించారు. వీరందరికీ 31వ తేదీన ఆర్డర్‌లు జారీ చేయగా శుక్రవారం వారు బదిలీ అయిన పీహెచ్‌సీలలో జాయినింగ్ రిపోర్టులు అందించారు. కారంచేడు మండలంలో మూడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీలో కారంచేడు సెక్టార్ హెచ్‌వీగా విధులు నిర్వహిస్తున్న వసంతవల్లి చీరాల (వైకుంఠపురం) పట్టణ ఆరోగ్యకేంద్రం హెచ్‌వీగా బదిలీ అయ్యారు. కుంకలమర్రు సెక్టార్ హెచ్‌వీగా విధులు నిర్వహిస్తున్న వీ వీరమ్మను కారంచేడుకు, స్వర్ణ పీహెచ్‌సీకి హెచ్‌వీ ఈపురుపాలెం పీహెచ్‌సీ నుంచి పీ మాధురీ సిపోరా, హెచ్ఈవోగా పల్నాడు జిల్లా ఏనుగుపాలెం పీహెచ్‌సీ నుంచి వీ నాగేశ్వరరావులు బాధ్యతలు తీసుకున్నారు. దగ్గుబాడు పీహెచ్‌సీకి హెచవీగా ప్రకాశం జిల్లా టంగుటూరు నుంచి సుమతి, మార్కాపురం పీహెచ్‌సీ నుంచి భాస్కర్‌లు బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న వివిధ కేడర్ ఉద్యోగులను ఆయా పీహెచ్‌సీల సిబ్బంది అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులు అధికారుల సాయంతో మరింతగా పనిచేస్తామన్నారు.

ప్రతి గడపను పలకరిస్తూ.. ఆప్యాయంగా మాట్లాడుతూ

- గడప గడపలో నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్



లబ్ధిపత్రాలను అందిస్తున్న వెంకటేష్

చీరాల: ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కారం దిశగా కృషిచేస్తున్నామని వైఎస్సార్ సీపీ చీరాల నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. చీరాల మండలం సాల్మన్‌సెంటర్ పంచాయతీలోని సచివాలయ పరిధిలో శుక్రవారం రెండోరోజు కార్యక్రమాన్ని చేపట్టారు. వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని ప్రతి అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అనంతరం ఆయన గడప గడపకు వెళ్లి కుటుంబ సభ్యులను పలకరించి సంక్షేమ పథకాలు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వార్డులోని లబ్ధిదారులకు బుక్‌లెట్‌లు అందించారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, ఆర్‌బీకే చైర్మన్ కావూరి రమణారెడ్డి, బాపట్ల జిల్లా వ్యవసాయశాఖ మండల సభ్యులు పులి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ గోలి నాగరాజు, మాజీ సర్పంచ్ ఎం.పద్మ, గుంటూరు వెంకట సుబ్బారావు, గుర్రం బుజ్జి, దివి జయరావు, ధనుంజయ, ఆసాది అంకాలరెడ్డి, తులాబందు సురేష్, కౌన్సిలర్లు చీమకుర్తి బాలకృష్ణ, గోలి స్వాతి, మల్లెల లలిత తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కోర్సులో నూరుశాతం ఉత్తీర్ణత



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్

అద్దంకి రూరల్: సిస్కో నెట్ వర్కింగ్ అకాడమీ ద్వారా నిర్వహించిన ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులో కళాశాల విద్యార్థులు నూటికినూరు శాతం ఉత్తీర్ణత శాతం సాధించినట్లు స్థానిక కేఆర్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ వీ. మోహన్‌రావు అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శుక్రవారం మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సు ప్రారంభించామని తెలిపారు. మే 1న ప్రారంభించి ఆగస్టు 31వ తేదీతో ముగిసిందన్నారు. ఉత్తీర్ణులైన 25 మంది విద్యార్థులకు ప్రిన్సిపల్ సర్టిఫికెట్లు అందజేశారు. కోర్స్‌లో శిక్షణ ఇచ్చిన జేకేసీ మోటార్ వినుకొండ రమేష్, జేకేసీ కో ఆర్డినేటర్ షర్మిలారాణిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన సేవలు

బల్లికురవ: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఇంటింటా వైద్యసేవలు అందిచేందుకు ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్యాన్ని అందుబాటులో తెచ్చిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహమ్మద్ తెలిపారు. శుక్రవారం సోమవరప్పాడు సచివాలయ పరిధిలో 104 శిబిరంలో భాగంగా షుగరు, బీపీ, హెచ్‌బీ పరీక్షలతో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సాయంత్రం మంచాల్లో ఉన్న వృద్ధులను చిన్నారులను ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు చేశారు.

నేడు డాక్టర్ వైఎస్సార్ వర్ధంతి వేడుకలు

కారంచేడు: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మండల వైఎస్సార్ సీపీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పిచడంతో పాటు, ఆసుపత్రుల్లో పేద రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆపార్టీ మండల కన్వీనర్ దండా చౌదరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల్లో కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు కార్యక్రమంలో పెద్ద ఎత్తున హాజరవ్వాలని ఆయన కోరారు.

చీరాల: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి పురస్కరించుకుని శనివారం పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు.

విద్యుత్ కోతలకు నిరసనగా ధర్నా

బల్లికురవ: అప్రకటిత విద్యుత్ కోతలకు పంటలు ఎండిపోతున్నాయని శుక్రవారం సాయంత్రం బల్లికురవలోని సబ్‌స్టేషన్ ముందు వివిధ గ్రామాల రైతులు నిరసనతో ధర్నా చేపట్టారు. పది రోజులుగా పగలు రాత్రి తేడా లేకుండా కోతలతో బోర్లకింద సాగుచేసిన వివిధ పంటలు ఎదుగుదల లేక ఎండిపోతున్నాయని, ఈఎల్ఆర్ పేరిట కోతలతో గృహోపకరణాలు సైతం దెబ్బతిన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బల్లికురవ- సంతమాగులూరు ఆర్అండ్‌బీ రోడ్‌లోని సబ్ స్టేషన్ ముందు గంటపాటు రైతులు ధర్నా చేపట్టారు.